# తీరని బాధ ★

"శ్రీ గిరిధర్"

"కన్నయ్య ఎందుకు తీస్తాడండీ? వాడలాటి వాడు గాదు" అన్నాది శారద కాఫీ కప్పు భర్తకందిస్తూ.

"నీకు తెలీదు శారదా!"

"వాడుదొంగ కాడండీ! వాడే తీసేమాటయితే, ఇన్నాళ్ళూవాణ్ని ఎవరాటంకం పెట్టారు? మూడేళ్ళనుంచీ మనింట్లోనే పనిచేస్తున్నాడుకదా! నేనొకనాడు బాత్ రూంలో ఉంగరంమర్చిపోతే తెచ్చియిచ్చాడు. నేదబ్బులు, అక్కడా, యిక్కడా పారేస్తే, తెచ్చియిచ్చేవాడు ..."

"అలాగే వుంటారు శారదా! ఇదంతా నమ్మించడం కోసం; వాడుతప్ప మరెవ్వరూ తియ్యరు" అని గట్టిగా చెప్పేశాడు భర్త ప్రసాద్.

"వాడి కివ్వ దెందుకండీ, యాభై రూపాయలు?" అన్నాది తిరిగి శారద.

"ఎందుకేమిటి?— నిన్న వుదయం వచ్చి నన్ను పది రూపాయలుంటే యివ్వమన్నాడు. లేవన్నాను— పదిరూపాయల కోసం, పర్సు తీశాడు. యాభై వున్నాయి .... అంతే, పర్సేదాచేశాడు...."

"రామ.... రామ.... ఎందుకండీ, పాపం మాటలు ఆడిపోసుకోవడం? ఈ అనుభవిస్తున్నది చాలదూ? కాపరానికొచ్చి ఆరేళ్ళయినా.... పిల్లాజల్లాలేక .." అంటూ పమిటచెంగుతో కన్నీళ్ళు తుడుచుకుంది శారద.

"ఇంతకీ కన్నయ్యఏడీ?" అని అడిగాడు ప్రసాద్. "ఏం?" అందిశారద. "ఏం, ఏమిటి? వాణ్నిలారమ్మను." అన్నాడు కొంచెం కటువుగా.

"కన్నయ్యా....!" అంటూ కేకేసిందిశారద. "వస్తున్నానమ్మా!" అంటూవచ్చాడు కన్నయ్య. కన్నయ్య మరీ పెద్దవాడు గాదు. ముప్పయ్యేళ్ళవాడు, మంచివాడు.

"బాబుగారు పిల్చార్రా" అంది శారద.

"ఏంబాబూ?"

"కన్నయ్యా, నిన్నొకటి అడుగుతా కాని నిజంచెప్తావు కదూ!" అన్నాడు ప్రసాద్ సిగరెట్ పొగని గాలిలోకి వదుల్తూ.

"చిత్తం!" అన్నాడు వినయంగా కన్నయ్య. రెండు చేతులూ కట్టుకొని.

"అయితే, నాపర్సు ఎవరు తీశార్రా?" ప్రసాద్ కన్నయ్యవైపు అదోరకంగా చూశాడు,

"పర్సా....!? తెల్దుబాబూ!"

"ఊఁ....హుఁ ... ఇంకా ఎందుకురా అబద్ధం? నిజం చెప్పెయ్! వూరుకుంటాను ..."

"ఛా! నా కుటుంబంలో ఆ ఎధవబుద్ధి బాబూ; లేదు నా ప్రాణంపోయినా..."

"ఉపన్యాసం కట్టిపెట్టు! నువ్వుతప్ప మరెవరూ తియ్యరు, మర్యాదగా యిచ్చెయ్! లేకుంటే బొక్కలో పెట్టించేస్తాను!" అన్నాడు గుడ్లురుముతూ ప్రసాద్.

"బా....బూ! ఈమాట మీరన్నారు కాబట్టి శాంతించినా, ఇదేమరొరు అనివుంటే...."— "నోర్ముయ్....!" అంటూ చెంపమీద చాచిపెట్టి కొట్టాడు. కన్నయ్య మాట మధ్యలోనే తుంచేసి ప్రసాద్.

"హుఁ... ఎదవదెబ్బ! ఇదోలెక్కా బాబూ!" అన్నాడు కన్నయ్య.

"నిజంచెప్పు!"

"నిజం... ఆధి దేవుణ్ని అడగండిబాబూ! ఆయన సెప్తాడు....!"

"దేవుణ్నే అడుగుతాను: నాలుగు కర్ర దెబ్బలు పడితే నీ నోటంటే వస్తుంది నిజం. ప్రసాద్ కన్నయ్యని స్టేషన్‌కు ఒప్పచెప్పాడు.

"కన్నయ్యఎముకలువిరిగాయి!చర్మంపూడిపోయింది! నెత్తురు చిమ్మింది!!! అయినా "తియ్యలేద"న్న మాట తప్పితే "తీశా" నన్న మాట కన్నయ్యనోటి వెంబడి రాలేదు, కన్నయ్యను కొట్లో పెట్టారు.

"మూర్ఖపువెధవ! నిజంచెప్పడే!" అన్నాడు భోజనం చేస్తూ ప్రసాద్.

"ఎవరూ?" అంది పరాకుగా శారద.

# తీరని బాధ

"వాడే, కన్నయ్య! తీశానని వొప్పుకోడు కదా! ఒప్పుకుంటే దయదల్చొచ్చు....!"

"పాపం! వాడు తియ్యనిదే ఎలా ఒప్పుకుంటాడూ?"

"ఏమిటీ? వాడు తియ్యలేదూ?" శారద మీద రెచ్చిపోయాడు ప్రసాద్.

"వాడే తీశాడని ఎలా చెప్పగలం? ఇంకెవరూ తియ్యకూడదా?" అన్నాది శారద.

"అంటే.... నా తమ్ముడు తీశాడంటావ్! అంతేనా?" ప్రసాద్‌కి అరికాలిమంట నెత్తికెక్కింది.

"నేనలా అన్నానా? గుమ్మడి కాయలదొంగా. అంటే భుజాలు తడుముకోడం దేనికీ?" శ. ఎత్తి పొడుపుతో శారదమీద కారాలు మిరియాలు నూరాడు ప్రసాద్.

ప్రసాద్ తమ్ముడు వేణూ. పన్నెండేళ్ళ వాడు. చదువూ సంధ్యాలేదు. ఇంట్లో డబ్బు ఎత్తుకు పోవడం. సినిమాలూ అవీ చూడటం! ఇదీపని.

డబ్బుపోయిన రోజునే అంతక ముందువచ్చి రెండు రోజులుండి వెళ్ళాడు. ప్రసాద్ వేణూని శారద దొంగగా కట్టిందని గ్రహించాడు.

శారద అన్నమాటలు అలా బాధిస్తూనే వున్నాయి ప్రసాద్‌ని. ఎలాగూ ఆదివారం సెలవుకాబట్టి శనివారం ఒక్కరోజు శెలవుపెట్టి, తల్లి దగ్గరకు వెళ్ళాడు.

భోజనం అదీ అయింది. బళ్ళోకి వెళ్ళిన వేణూ తిరిగి యింకారాలేదు. ఇంతలో ఎవరో బాకీలవాళ్ళు వచ్చారు.

"అబ్బాయ్! చిల్లరున్నాదిరా?" అని అడిగింది తల్లి ప్రసాద్‌ని.

"ఎంతదమ్మా?"

"పదిరూపాయలది! పాలవాళ్ళ కివ్వాలి."

"ఇలాతే. యిస్తాను," అన్నాడు ప్రసాద్.

తల్లి పెట్లోనుంచి పర్సు తీసుకొనివచ్చి. అందుట్లోనుంచి పదిరూపాయల కాగితం తీసియిచ్చింది. ప్రసాద్ కాయితం పుచ్చుకుంటూ తల్లి చేతిలో పర్సు చూశాడు.

"ఏదమ్మా పర్సూ." అంటూ పర్సు పుచ్చుకున్నాడు తల్లి దగ్గర్నుంచి పర్సు తనదే; అందులోనే యాభై రూపాయలూ పెట్టుకున్నాడు!! అది తీశాడనే కన్నయ్యని జైల్లో పెట్టించాడు!!!

"ఎక్కడిదమ్మా యీ పర్సూ?"

"మీ తమ్ముడు దగ్గరుంటే అడిగి పుచ్చుకున్నాను!" ప్రసాద్ యింకేం మాటాడలేకపోయాడు.

కన్నయ్యను విడిపించాలనుకున్నాడు. ఎలా విడిపిస్తాడు? తీరాకన్నయ్యని విడిపిద్దామని, అన్నీ చేసేవరకూ కన్నయ్యే, యీ లోకంతోటీ సంబంధం లేకుండా వెళ్ళిపోయాడు.

ప్రసాద్‌కి "చివరికి బ్రతికి వుండగా, కన్నయ్యను విడిపించలేక పోయానే!" అనే బాధ వుండిపోయింది! పాపం! అది తీరని బాధే....!